క్లుప్తంగా

తోటపల్లికి పోటెత్తిన భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పవిత్ర శనివారం కావడంతో తులసీదళాలతో ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని భక్తులు దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతర ఆలయ ప్రాంగణంలో జరిగిన అన్నదాన కార్యక్రమానికి వెళ్లి, స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

అభినందనలు



చైతన్యను అభినందిస్తున్న ఎంఈఓ ఆనంద రావు, హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయ సిబ్బంది

వీరఘట్టం: ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ సెమినార్‌లో 3వ స్థానంలో నిలిచిన కత్తులకవిటి జిల్లా పరిషత్ హైస్కూల్ పదోతరగతి విద్యార్థి జి.చైతన్య, గైడ్ టీచర్ జేమ్స్‌ను ఎంఈఓ ఆర్. ఆనందరావు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు హెచ్ఎం పైల సుధారాణి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

లారీ బోల్తా



పడిపోయిన లారీ

భామిని: మండలంలోని పసుకుడి వద్ద శనివారం వేకువజామున లారీ బోల్తా పడింది. వైజాగ్ నుంచి రాయ్‌పూర్ మెటల్ లోడ్ తీసుకెళ్తున్న లారీ పసుకుడి వద్ద డైవర్షన్ తీస్తుండగా పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

సీతంపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఏపీఓ ఎస్‌వీ గణేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


'పది' విద్యార్థులకు చెకుముకి పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక కేజీబీవీ పదో తరగతి విద్యార్థులకు శనివారం చెకుముకి పరీక్ష నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి పరీక్ష పెట్టినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీరంజని తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేందుకు వీలుగా ఈ పరీక్ష దోహద పడుతుందన్నారు. పాఠశాల స్థాయిలో ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పాలకొండ: వ్యవసాయ కార్మిక సంఘ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో సభలకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక సంఘ జిల్లా మహాసభలను పార్వతీపురంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో దూసి దుర్గారావు, సింహాచలం, జె. దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

'హరిత దీపావళి' చేసుకోవాలి

పాలకొండ రూరల్: పర్యావరణానికి ముప్పు ఏర్పడకుండా.. సంప్రదాయాన్ని గౌరవిస్తూ ప్రతి ఒక్కరూ హరిత దీపావళి చేసుకోవాలని వెంకంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నినదించారు. ఈ మేరకు గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం గోపీనాథ్ మాట్లాడుతూ..టపాసులు కాల్చడం వల్ల శబ్ద కాలుష్యంతో పాటు వాయు కాలుష్యం జరుగుతుందని చెప్పారు. మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి పండుగ చేసుకోవాలని సూచించారు.

పసుపు సాగుకు ప్రోత్సాహం..

- యంత్రాల పంపిణీకి రూ.95 లక్షల నిధుల మంజూరు
- ఐటీడీఏ పరిధిలోని 20 సబ్‌ప్లాన్ మండలాల రైతులకు ప్రయోజనం
- 90 శాతం సబ్సిడీపై పరికరాలు ఇవ్వనున్న కేంద్ర ప్రభుత్వం

సీతంపేట:

గిరిజన ప్రాంతాల్లో పండించే పసుపు ఎంతో నాణ్యమైనది. ఏజెన్సీలో సాగు చేసే పసుపు పంటకు బయటమార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అయితే పసుపు పండించిన తర్వాత ప్రాసెసింగ్ చేయడం రైతులకు చాలా కష్టమవుతోంది. పసుపు తవ్విన తర్వాత ఉడకబెట్టడం, ఆరబెట్టడం, ప్రాసెస్ చేయడం రైతులకు ఇబ్బందిగా మారుతోంది. దీంతో ఏజెన్సీ రైతులు పసుపు పండించడానికి వెనకడుగు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి పసుపు సాగు చేసే రైతులను ఆదుకోనుంది. ఆధునిక యంత్రాలున్నట్లయితే పసుపును సులువుగా ప్రాసెసింగ్ చేయవచ్చని రైతుల అభిప్రాయం. ఈ క్రమంలో ఆధునిక యంత్రాలు రాయితీపై సమకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న 20 సబ్‌ప్లాన్ మండలాల్లో పసుపు సాగు చేస్తున్న రైతులకు వివిధ రకాల యంత్ర పరికరాలు సమకూర్చే చర్యలకు ఉపక్రమించింది. దీనిలో భాగంగా 275(1) పద్దుకింద రూ.95 లక్షల నిధులు మంజూరు చేస్తూ విడుదల చేసిన ఉత్తర్వులు ఐటీడీఏకు చేరాయి. ఐటీడీఏ పరిధిలో 3,786 మంది రైతులు 6,887 ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నారు. దీంతో వీరందిరికీ ప్రయోజనం చేకూరనుంది. ఎకరాకు 1.4 మెట్రిక్ టన్నుల పసుపు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

90 శాతం సబ్సిడీ..

ప్రాసెసింగ్ చేసే యంత్రాలను రైతులకు 90 శాతం రాయితీపై అందించనున్నారు. అలాగే పసుపు ఉడికించే మినీ బ్రాయిలర్ యంత్రాలు 80.. ఆరబెట్టే యంత్రాలు ఐదు, పాలిస్ యూనిట్లు 42 ఐటీడీఏకు కేటాయించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం 95 లక్షల రూపాయలు కేటాయించింది.



గిరిజనులు సాగు చేస్తున్న పసుపు



(ఇన్‌సెట్లో) పాలిష్ యంత్రం

రైతులను గుర్తిస్తున్నాం..



సబ్‌ప్లాన్ పరిధిలోని 20 మండలాల్లో రైతులను గుర్తించే ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. యంత్రాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత పంపిణీ చేయనున్నాం. పసుపు రైతులకు ఈ యంత్రాల ద్వారా చాలా వరకు శ్రమ తగ్గుతుంది. ఉడకబెట్టే యంత్రంలో ఒకే సారి పసుపు వంద కిలోల వరకు ఉడుకుతుంది. అలాగే వంద కిలోల వరకు పాలిష్ చేయవచ్చు.

– ఎస్‌వీ గణేష్, ఉద్యానవనశాఖాధికారి, సీతంపేట

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



కంబరవలస కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ గౌరునాయుడు

వీరఘట్టం: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓ డి.గౌరునాయుడు సూచించారు. కంబర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడికి రాని విద్యార్థులను గుర్తించి పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. ఇందుకోసం చిన్నారుల తల్లిదండ్రులను కలిసి చైతన్యపరచాలని తెలిపారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం యాక్టివిటీలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ–2 పరీక్షల ప్రశ్నపత్రాలను వాల్యూషన్ చేసి మార్కులను నమోదు చేయాలన్నారు. అలాగే వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, బిటివాడ, కత్తులకవిటి ఉన్నత పాఠశాలల్లో కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియ

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియ మాట్లాడుతూ.. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం బాలికలకు రక్షణ కల్పించే చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాలకొండ బార్ అసోసియేషన్ సభ్యులు శామ్యూల్, రామ్మోహనరావు, కుమార్, ఏఎస్పై సంజీవు, ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి, వైస్ ప్రిన్సిపాల్ సీతారావమ్మ, డిప్యూటీ వార్డెన్ సుజాతకుమారి, అధ్యాపకులు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

గండి పూడ్చి ఆయకట్టుకు నీరు మళ్లింపు



గండి పూడ్చే పనుల్లో నీటి సంఘం సభ్యులు

జియ్యమ్మవలస రూరల్: వట్టిగెడ్డ రిజర్వాయర్ ప్రధాన ఎడమ కాలువకు ఇటీవల పడిన భారీ గండిని పూడ్చివేసి ఆయకట్టు భూములకు సాగునీరు మళ్లిస్తున్నారు. గండి పడిన విషయం తెలుసుకున్న జియ్యమ్మవలస నీటి సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, నీటి సంఘం సభ్యులు తక్షణమే స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇదిలా ఉంటే గండి పడిన చోట రిటైనింగ్ వాల్ నిర్మించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

బీసీల హక్కుల సాధనకు పోరాటం



తెలంగాణలోని బీసీల రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంఘీభావం తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

గరుగుబిల్లి: బీసీల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాటం చేయాలని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవాల రామకృష్ణ అన్నారు. మండలంలోని ఖడ్గవలస గ్రామ కూడలిలో తెలంగాణలోని బీసీ సంఘాల రాష్ట్రవ్యాప్త బంద్‌కు మద్దతు తెలిపే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికల్లో చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్ అమలుచేస్తూ తెలంగాణలో ఎన్నికలు నిర్వహించాలని బీసీలంతా ఐక్యంగా పోరాటం చేయడం జరుగుతోందన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కురుపాం: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కుమారస్వామి సూచించారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ఎ.రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీవోలు డి.రామయ్య, శ్రీవాణిలు విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించి, స్వచ్ఛమైన ఆంధ్రప్రదేశ్‌ను రూపుదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

బస్సు సదుపాయం పునరుద్ధరించాలి



పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

జియ్యమ్మవలస: తమ గ్రామానికి గతంలో ఉన్న బస్సు సదుపాయాన్ని పునరుద్ధరించాలని మండలంలోని పెద్దబుడ్డిడి గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు పార్వతీపురం వెళ్లి, ఆర్టీసీ డిపో మేనేజర్ లక్ష్మణరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం గ్రామానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో గ్రామంలోని విద్యార్థులు కళాశాలలకు మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామస్తులు కూడా అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం అందుకోలేకపోతున్నామన్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సీమల బాబూభువనమోహనరావు, ఉపసర్పంచ్ రేవళ్ల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో2 శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పెదమేరంగి, చినమేరంగి, జియ్యమ్మవలస, పెదబుడ్డిడి, బీజేపురం క్లస్టర్ పాఠశాలల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం జరిగాయి. జియ్యమ్మవలస క్లస్టర్‌లో జరిగిన సమావేశానికి ఎంఈవో శ్రీనివాసరావు హాజరై, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని, గ్రేడ్–సి, గ్రేడ్–డి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి విద్యా ప్రగతికి కృషి చేయాలని కోరారు. సిలబస్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, సమయానికి ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాలని తెలిపారు.

బాలికలు మనోధైర్యంతో మెలగాలి



మాట్లాడుతున్న డీసీపీవో సత్యనారాయణ

గరుగుబిల్లి: బాలికలు మనోధైర్యంతో మెలగాలని డీసీపీవో ఎ.సత్యనారాయణ సూచించారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకుని, మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులకు శనివారం పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలకు సంబంధించిన హక్కులపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని ఆత్మహత్యకు పాల్పడవద్దని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ జి.తవిటినాయుడు, ప్రిన్సిపాల్ ఎ.రజనికుమారి, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువులకు తనిఖీలు

బలిజిపేట: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీతానగరం ప్రాంతీయ పశువైద్య శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. సుభద్రలో జిల్లా పశుగణ అభివృద్ధి సంస్థ, విజయనగరం వారి ఆధ్వర్యంలో ఉచిత పశుగర్భకోశ వైద్య శిబిరాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాలకు అవసరమైన వైద్యసేవలను మనమే గుర్తించి వాటికి తగిన సంరక్షణ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతో అవసరమన్నారు. శిబిరానికి వచ్చిన వాటిలో 80 పశువులకు తనిఖీలు నిర్వహించి వాటికి అవసరమైన మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గణేష్, జి.కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రెల్ల గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ కలిసి శనివారం భూమిపూజ చేశారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి చిన్నారులకు అవసరమైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో భద్రగిరి సీడీపీవో కె.విజయగౌరి, ఎంపీడీవో ఎల్.శ్రీనివాసరావు, సర్పంచ్ ఎం.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల జీవితాలతో చెలగాటమా..?

- కోటి సంతకాల సేకరణలో ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ/పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతోందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ధ్వజమెత్తారు. మండలంలని బాసుర గ్రామంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సంపద సృష్టి అని చెప్పి.. వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు అందుబాటులోనికి వైద్య విద్య తీసుకువస్తే.. కూటమి సర్కార్ ప్రైవేట్ వారికి కట్టబెట్టాలనుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందని.. ఇందులోభాగంగానే కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కనపాక సూర్యప్రకాష్‌రావు, నల్లి శివప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అనంతరం పాలకొండ పట్టణానికి సంబంధించి ఏఎంజీ కన్వెన్షన్ హాల్ వద్ద కోటి సంతకల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విక్రాంత్ స్వయంగా సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలమల మన్మధరావు, వై. లిల్లీపుష్పనాథం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



పట్టణంలో సంతకాల సేకరణ చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ..

పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులు శనివారం 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి. హరగోపాల్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, వాహన కాలుష్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ వెలమల అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైఫల్యాన్ని టీచర్లపై నెట్టడం సరికాదు...

పార్వతీపురం రూరల్: గిరిజన సంక్షేమ శాఖ విద్యా సంస్థల్లో వసతుల లేమి రాజ్యమేలుతుంటే ఆ నెపాన్ని ఉపాధ్యాయులపై నెట్టడం సరికాదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యానికి బోధకులనే బాధ్యులను చేస్తూ వేధించడం ఎంతవరకు సమంజసమన్నారు. సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు శూన్యంగా ఉన్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం లేదని ఆరోగ్యం పర్యవేక్షించేందుకు ఏఎన్ఎంల నియామకాలు చేపట్టడం లేదని ధ్వజమెత్తారు. ప్రతీ వైఫల్యానికి ఉపాధ్యాయులను బలిపశువులను చేయడం సరికాదన్నారు.

గురువులను బాధ్యులను చేయడం సరికాదు

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను ఉపాధ్యాయులపై మోపడాన్ని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అధికారుల నిర్ణయంపై ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మువ్వల అమర్నాథ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను బాధ్యులను చేసే ముందు వసతిగృహాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని, కొరతగా ఉన్న సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. పౌష్టికాహారంతో కూడిన మెనూ అమలు కావాలంటే మెస్ చార్జీలు పెంచాలని, విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించేందుకు ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని అన్నారు.